# చిన్నకోరిక

-మద్దాలి నిర్మల

ఇల్లంతా ఓ లాంటి నిశ్శబ్దం ఆవరించి వుంది. అలాగని ఇంట్లో మనుషులు లేరనుకుంటే పొరబాటే. అప్పటికి కామేశ్వరమ్మ గారు పోయి అయిదురోజులైంది. ఆవిడ తాలూకు జ్ఞాపకాలు ఆ యింట్లోని సభ్యుల మనస్సుల్లో అలాగే వున్నాయి. ఆవిడ ఇంకా ఇంట్లో తిరుగుతున్నట్లే వుంది. వచ్చిన దగ్గరి బంధువులూ, ఆవిడ మిగతా కొడుకులూ, కోడళ్ళూ మళ్ళీ తొమ్మిదోనాటికి వస్తామని వెళ్ళిపోయారు. మిగిలిందల్లా ఆ యింటి యజమానీ, కామేశ్వరమ్మగారి పెద్దకొడుకూ అయిన కృష్ణమూర్తీ, ఆయన భార్య భారతీ, వాళ్ళ పిల్లలూ. వాళ్ళకి సాయంగా కృష్ణమూర్తి మేనత్త పార్వతమ్మగారు కూడా అక్కడే వుంది.

అసలు కామేశ్వరమ్మగారికి ముగ్గురు కొడుకులూ, ఓ కూతురూ వున్నప్పటికీ, ఆవిడ ఎప్పుడే కృష్ణమూర్తి దగ్గరే వుండేది. అతను ఆ యింటి పెద్దకొడుకవటం ఓ కారణం అయితే, రెండో కారణం ఆమె కోడలు భారతి. కామేశ్వరి గారికి భారతి కూతురిలాగే వుండేది. వాళ్ళిద్దరిదీ పాతికేళ్ళ అనుబంధం. అవసరమై మిగతా పిల్లల దగ్గరకెళ్ళినా, పనైపోగానే మళ్ళీ వెంటనే పరుగెత్తుకుంటూ వచ్చేసేదావిడ.

"అదేమిటత్తయ్యా! వాళ్ళూ మీ పిల్లలే కదా! ఓ నాలుగు రోజులుండి రాకపోయారా? అలా వెంటనే వచ్చేస్తే వాళ్ళేమనుకుంటారు?" అనేది భారతి.

"మనం వెళ్ళిన పనయిపోయింది. ఇంకా ఎందుకు చెప్పు. మనపని మనం చేశాం. వచ్చేశాం. అంతే" అనేదావిడ.

అసలు కారణం మిగతా కొడుకుల ఇళ్ళలో ఆవిడకు స్వతంత్రం లేదు. ఆవిడ కోడళ్ళందర్నీ కూతుళ్ళలాగే ఆదరించినా, వాళ్ళెందుకో అంటీ ముట్టనట్లే వుంటారు. అందుకే ఆవిడకి తన కొడుకుల దగ్గరకి వెళ్ళినట్లు కాక చుట్టాలింటికి వెళ్ళినట్లే అన్పిస్తుంది. ఆ కారణంగానే ఎక్కువగా వాళ్ళ యిళ్ళకి వెళ్ళదు.

మళ్ళీ తొమ్మిదో రోజు నుండి హడావిడి మొదలైంది. కర్మకాండలు యధావిధిగా జరుగుతున్నాయి. బంధువుల రాకతో ఇల్లంతా సందడిగా వుంది. దేనికీ లోటు రాకుండా కార్యక్రమాలన్నీ జరిపిస్తున్నారు. కొడుకులూ, కోడళ్ళందరూ తమ విధులు నిర్వహిస్తూ వున్నారు. డబ్బుకు వెనకాడకుండా ఖర్చు పెడుతున్నారు.

భారతికి మాత్రం ఆవిడ ఇంకా యింట్లో తిరుగుతున్నట్లే వుంది. ఆవిడ యీ లోకంలో లేదంటే నమ్మ బుద్ధికావటం లేదు. కార్యక్రమాల్లో పాల్గొంటున్నా. ఆమె కళ్ళు చెమ్మగిల్లటం మానలేదు. అవతలకి వెళ్ళినపుడల్లా కళ్ళు తుడుచుకుంటూనే వున్నది. తను బయటికి బాధపడితే తన పిల్లలు ఇంకా బెంగ పెట్టుకుంటారని మౌనంగా దుఃఖాన్ని భరిస్తోంది. ఒక రోజుదా, రెండు రోజులదా ఈ అనుబంధం. పాతికేళ్ళుగా ఒకే ఇంట్లో కలసిమెలసి వున్నారు.

భోజనాలు పూర్తయి అంతా వసారాలో చేరారు. పక్క గదిలో ఆరోజు లెక్కలు సరిచూసుకుంటోంది భారతి.

"అసలు అమ్మకి ఇంత బాగాలేదని మాకు కబురు చేశారా? చేస్తే ఒక్కసారన్నా వచ్చి చేసేదాన్ని" ఆడపడుచు మేనత్తకి ఫిర్యాదు చేస్తోంది.

"ఆవిడ బతికుండగానే చూసే అవకాశం లేకపోయింది"

" ఆ! ఊళ్ళో ఉన్న మాకే తెలియదు. నీకేం తెలుస్తుంది" ఇంకో తమ్ముడంటున్నాడు.

భారతికి దుఃఖమూ, కోపమూ ఒకేసారి

వచ్చాయి. ఆవిడ అంత హఠాత్తుగా చనిపోతుందని ఎవరూ అనుకోలేదు.

సంవత్సరం క్రితం ఆవిడకి గుండెజబ్బని తెలిసింది. అప్పుడే డాక్టర్లు చెప్పారు. ఆవిడ చాలా జాగ్రత్తగా వుండాలని, ఆపరేషన్‌లాటిది చెయ్యటానికి ఆవిడకున్న షుగరూ, బీ.పీ. అడ్డంకులనీ, వీటికి తోడు ఆవిడ వయసూ, శారీరక స్థితీ ఆపరేషన్‌ని తట్టుకునే స్థితిలో లేవనీ, కేవలం మందులు వాడుతూ, విశ్రాంతి తీసుకోవటం తప్ప చెయ్యగలిగిందేమీ లేదనీ.

ఆ సంగతి పిల్లలందరికీ తెలుసు. అయినా ఈ ఏడాది కాలంలో ఒక్కసారికూడా వచ్చి చూడలేదు. పైగా ఇప్పుడు నిష్టూరాలు. అంత తల్లి మీద ప్రేమ వున్నవాళ్ళు ఆవిడ క్షేమసమాచారాలెప్పుడైనా కనుక్కున్నారా? ఎలా వున్నావమ్మా అని ఏనాడైనా గడపతొక్కి పలకరించారా? లేదే? ఇప్పుడు ఎక్కడలేని ఆపేక్షలూ చూపిస్తున్నారు.

"అసలు మా అమ్మ చిన్నప్పటి నుండీ కష్టపడుతూనే వస్తోంది. చచ్చేవరకు ఆవిడకి చాకిరీ తప్పలేదు. అసలు మా అమ్మ ఏనాడు సుఖపడింది గనుక" చేయించుకున్నన్నాళ్ళు చేయించుకుని ఇప్పుడు దొంగ ఏడుపులు."

అంత విచారంలోనూ భారతికి నవ్వొచ్చింది. మనిషి విలువ బతికున్నప్పుడు తెలియదు. చనిపోయిన తర్వాతే వాళ్ళమీద ఆపేక్షలు పెరుగుతాయి. ఇంత ప్రేమ వున్నవాళ్ళు తల్లికి బాగాలేదని తెలిసినపుడు తమ ఇంట్లో విశ్రాంతి ఇవ్వచ్చుకదా? కనీసం అప్పుడు తొంగి చూడటానికైనా కుదరలేదు వీళ్ళకి. ఇప్పుడు చనిపోయింది కాబట్టి ఏమైనా మాట్లాడగలుగుతున్నారు. అయితే వాళ్ళతో చర్చకు దిగే ఉద్దేశ్యమూ, ఓపికా ఇప్పుడామెకి లేవు. తన దగ్గర అత్తగారు సుఖపడిందో లేదో తన మనసుకి తెలుసు. అత్తగారి ఆత్మకు తెలుసు. వీళ్ళందరికీ సంజాయిషీలు ఇవ్వవలసిన అవసరం లేదు.

భారతి మళ్ళీ ఆలోచనలో పడింది.

నిజమే. ఆవిడ పదేళ్ళు వచ్చేవరకు ఏం సుఖపడిందో ఏమో! ఆ తర్వాత తండ్రి చనిపోవటం, ఆస్తులన్నీ అప్పులవాళ్ళ పాలుకావడం, చివరికి ఓ ఇల్లూ, కట్టు బట్టలతో తల్లీ పిల్లలు మిగలటం, ఇవన్నీ తన చిన్ననాటి అనుభవాలుగా ఆవిడ చెప్పినవి. ఆ తర్వాత అన్నగారింట్లో ఆవిడ అనుభవించిన నిరాదరణ, పెళ్ళి చేసుకున్న తర్వాత భర్తతో ఆవిడ పడిన ఇబ్బందులూ, కష్టాలు ఓ స్నేహితురాలిగా అప్పుడప్పుడూ మాటల సందర్భంలో చెపుతూ వుండేది.

ఓ రకంగా చెప్పాలంటే భారతికి తల్లితోకంటే అత్తగారితోనే అనుబంధం ఎక్కువ. ఓవయసొచ్చాక తల్లిదండ్రులు పిల్లలని స్నేహితులుగా చూడాలంటారు. తనకా వయసు వచ్చేసరికి ఉద్యోగం రావటం, వేరేవూరు వెళ్ళిపోవటం జరిగింది. అక్కడ వుండగానే పెళ్ళి జరగటం అత్తగారింటికి వెళ్ళిపోవటంతో ఆ వయసులో వచ్చే సమస్యలూ, సందేహాలూ, అనుభవాలూ అత్తగారితోనే పంచుకోవటం జరిగింది. తల్లి ఎంత ప్రేమగా చూసినా, తనకీ ఆవిడకీ మధ్య తల్లీపిల్లల మధ్య వుండే సంబంధం మాత్రమే వుంది. కానీ అత్తగారితో స్నేహ బాంధవ్యం కుదిరింది. తనకి సాధ్యమైనంత వరకు ఆవిడని సుఖపెట్టటానికే ప్రయత్నించింది. ఆవిడకూడా తనని కూతురిలాగా, స్నేహితురాలిలాగే చూసింది.

అసలు కష్టమేమిటి? సుఖమేమిటి? అంతా మన మనసులోనే వుంటుంది. మనిషికి మనశ్శాంతిని మించింది లేదు. నిజానికి తనొచ్చాకే కొంత మనశ్శాంతి. శారీరకంగా విశ్రాంతి ఏర్పడింది. అదివరకు ఇంటి పనికితోడు సంసార నిర్వహణ బాధ్యత కూడా ఆవిడ మీదే వుండేది. మామగారు ఇంటి విషయాలు పెద్దగా పట్టించుకునే వారు కాదు. తన ఉద్యోగం, తన గొడవ తప్ప ఆయనకి ఏమీ పట్టేదికాదు. తనొచ్చిన కొద్ది కాలానికే ఆయన రిటైరవ్వటం, ఆ తర్వాత చనిపోవటమూ జరిగింది. తను వచ్చాక ఆవిడ ఇంటి బాధ్యతలన్నీ తనకప్పగించి నిశ్చింతగా వుంది. ఆవిడ ఆరోగ్యం మెరుగుపడింది కూడా తనొచ్చాకే. మనసులోని బాధ ఇతరులతో పంచుకుంటే కొంతభారం తీరినట్లుంటుంది. సరిగ్గా తను వచ్చాక ఇదే

జరిగింది. అటువంటిది తను ఆవిడతో చాకిరీ చేయించుకుంటుందా? ఎటొచ్చీ తను ఉద్యోగానికి వెడుతుంది కాబట్టి తను ఆఫీసుకెళ్ళిన సమయంలో పిల్లల బాగోగులు చూడాల్సి వచ్చేది పిల్లలు పెద్దవాళ్ళయిన తర్వాత ఆ బాధ్యత కూడా తగ్గిపోయింది. దానికే చాకిరీ అని పేరుపెట్టి దెప్పుతోంది ఆడపడుచు. అసలు ఆవిడ బలహీనంగా వుండేదన్న మాటేగానీ తను వచ్చిన తర్వాత ఆరోగ్యంగానే వుండేది. నాలుగేళ్ళ కిందటే ఆవిడకి షుగరొచ్చింది. డాక్టర్లు చెప్పినట్టు మందులు వాడకపోవటం, ఆరోగ్య నియమాలు పాటించకపోవటంతో గుండెజబ్బుకి దారితీసింది. మొదట నుండీ ఆవిడకి ఆరోగ్యం పట్ల అశ్రద్ధే. విశ్రాంతి తీసుకోవమ్మా తల్లీ! అంటే వినకుండా చిన్నాచితకా పనులు చేసేది. మంచం దిగవద్దని గట్టిగా కేకలేస్తే-




“చూడమ్మాయ్! పుట్టినప్పుడే భగవంతుడు మన ఆయుర్దాయం రాసి పంపిస్తాడు. ఇప్పుడు నేను కదలకుండా కూచుంటే భగవంతుడు ఆయుర్దాయం పొడిగిస్తాడంటావా? ఆ డాక్టర్లు అలాగే చెపుతారు. “అవన్నీ మనం పట్టించుకోకూడదు” అంటూ కొట్టి పారేసేది.

నిజమే. అన్ని విషయాల్లోనూ ఆవిడకి లోటు రాకుండా చూసినా ఆవిడకున్న చిన్నకోరిక ఒకటి తీర్చలేకపోయింది. మనసుపొరల్లోకి వెళ్ళి ఆత్మ విమర్శ చేసుకుంటున్న భారతికి హఠాత్తుగా గుర్తొచ్చిందీ విషయం. నిజమే ఆ ఒక్క కోరిక

కూడా తీర్చి వుంటే తనకీ ఎంతో తృప్తిగా వుండేది. ఇక ఇప్పుడు మొదలైంది భారతి మనసులో కొత్తబాధ. ఆవిడ బతికున్నంత కాలం ఆ చిన్న కోరిక తీర్చలేకపోయింది డబ్బుకు వెరచి. కానీ ఇప్పుడు వేలకు వేలుపోసి ఆవిడ కర్మ కాండలు యధావిధిగా నిర్వహిస్తోంది తను.

ఏదో ఒకరోజు మాటల్లో అందావిడ.

"భారతీ! ఎక్కడికైనా వెళ్ళినప్పుడు కట్టుకోటానికి ఓ పట్టుచీర వుంటే బాగుంటుంది కదూ."

ఎన్నడూ ఏ వస్తువు కావాలని అడిగి ఎరగదావిడ. తనే ఆవిడ అవసరాలు గమనించి తీరుస్తూ వుండేది. మరి ఆవిడ ఎంతగా అనుకుంటే తన దగ్గర ఆ విషయం ప్రస్తావించిందో. కావటానికి చిన్నకోరికే అయినా అది తీర్చటం తనవల్ల కాలేదు. బతికుండగా ఖర్చుకి వెనకాడిన తను ఈ రోజు వేలకివేలు ఖర్చు చేస్తోంది. ఈ ధైర్యం అప్పుడే వుండి వుంటే ఎంత బాగుండేది. కానీ అప్పులంటే ఉన్న భయమే తనని ధైర్యం చెయ్యనివ్వలేదు.

అప్పట్లో తన జీతం నాలుగొందలైతే ఆ చీర ఖరీదు కనీసం ఏడెనిమిది వందలుండేది. నెలజీతం మొత్తం ఖర్చుపెట్టినా చీర వచ్చేది కాదు. బాధ్యతలలో నిండా మునిగిన తను అంత ఖర్చు పెట్టి పట్టుచీర కొనటానికి వెనకాడిన మాట వాస్తవమే. తామిద్దరూ సంపాదిస్తుంటేనే అంతంతమాత్రంగా గడిచేది సంసారం. ఇద్దరు మరుదులూ, అత్తగారూ, తనూ, భర్త ఇద్దరు పిల్లలూ, దీనికితోడు వచ్చీపోయే చుట్టాలూ. ఏ నెలైనా అనుకోని ఖర్చులు, పెళ్ళిళ్ళో పేరంటాలో, కాకపోతే ఎవరికైనా అనారోగ్యం చెయ్యటమో అయితే ఎక్కడికైనా వెళ్ళి అప్పు పుట్టించాల్సి వచ్చేది. అది తీర్చటానికి మళ్ళీ తిప్పలు పడాల్సి వచ్చేది. అందుకే చీర గురించి అప్పుచేసే తెగింపు తనలో లేకపోయింది. అప్పటికీ రెండుసార్లు ప్రయత్నం చేసింది. నెలకి కొంత చొప్పున దాచి చీరకి సరిపడా డబ్బు చేరాక కొందామని. రెండు నెలలు గడవకముందే అనుకోని అవాంతరానికి ఆ డబ్బు ఖర్చయిపోవటం జరిగింది. అంతే! మళ్ళీ కుదరలేదు. ఆవిడ వయసునీ ఆ కోరికనీ పోల్చి చూసి అది అంత అవసరంగా ఆనాడు తను అనుకోలేదు. అలా ఆలోచించి వుటే తప్పనిసరిగా తను కొంచెం ధైర్యం చేసి వుండేది. పెద్దవాళ్ళ పట్ల అందరూ వహించే నిర్లక్ష్యమే తనూ చూపించింది. అది కావాలని చెయ్యకపోయినా భారతికి బాధగానే వుంది. బతికున్న మనిషి విషయంలో పెట్టే ఖర్చు గురించి మనం వందసార్లు ఆలోచిస్తాము. దానివల్ల వచ్చే లాభనష్టాలు బేరీజు వేస్తాము. కానీ చిన్న చిన్న కోరికలు, అవసరాలు తీరితే పెద్దవాళ్ళు ఎంత తృప్తి చెందుతారో మనం గ్రహించం. ఆ కోరిక తీరటం కంటే దానికోసం పిల్లలు కనబరచిన శ్రద్ధవలన వాళ్ళకి కలిగే తృప్తి అలాంటిది.

అయినా ఆవిడ అంత త్వరగా చనిపోతుందని తనూ అనుకోలేదు. అదీగాక ఆవిడ ఆరోగ్యం క్షీణించాక తనకొక పిచ్చి భయం పట్టుకొంది. ఆ మూఢ నమ్మకం కూడా తనని గట్టిగా ధైర్యం చెయ్యనివ్వలేదు. చాలామంది ఏదో కోరిక మనసులో వుంటే అది తీరితే వెళ్ళిపోతారని ఎవరో అన్నారు. అదిగో ఆ గుండెజబ్బొచ్చాక మరీ భయం పట్టుకుంది తనకి ఇన్నాళ్ళూ వాయిదా వేస్తున్న కోరిక ఇప్పుడు తీరిస్తే వెంటనే ఆవిడెక్కడ వెళ్ళిపోతుందోనని. తన మూర్ఖత్వం కాకపోతే ఆ పని చేసినా చెయ్యకపోయినా ఆవిడ వెళ్ళనే వెళ్ళిపోయింది. ఆవిడ చెప్పినట్టుగానే ఆయుర్దాయం తీరితే వెళ్ళిపోతారు గానీ కోరికలు తీరిస్తే వెళ్ళిపోతారా? అప్పుడే కొనివుంటే ఆవిడకీ తనకీ తృప్తిగా వుండేది. ఇప్పుడు తను ఆవిడపేరు మీద పట్టుచీర దానం చెయ్యటానికి కూడా వెనకాడటంలేదు. కానీ అది ఆవిడ కట్టుకున్న తృప్తిరాదు కదా! ఏది ఏమైనా ఈ ధైర్యం అప్పుడే చేసి వుండవలసింది. భారతిలో తను తప్పు చేశానన్న భావం మాత్రం పోలేదు. అందుకే ఉప్పెనలాగా దుఃఖం ముంచుకొచ్చింది.

"భారతీ! నువ్వు కూడా ఏమిటి. చిన్నపిల్లలాగా! నువ్వే ఇలా వుంటే పిల్లలు ఏమైపోతారు. చిన్నప్పటి నుండీ వాళ్ళకి ఆవిడ దగ్గర చేరిక ఎక్కువ కదా! ఇప్పుడు నిన్ను చూస్తే

"వాళ్ళు ఇంకా దిగులు పడతారు." భర్త అనునయిస్తున్నాడు.

"కాదండీ! నేను తప్పుచేశాననిపిస్తోంది" తన మనసులోని బాధ బయటికి చెప్పింది.

"పిచ్చి భారతీ! అన్నీ మనచేతుల్లో వున్నాయా? నువ్వు చెయ్యాలనుకున్నా పరిస్థితులు బాగాలేక కుదరలేదు. ఇంతకీ ఆవిడకి ప్రాప్తం లేదు. అందుకే నువ్వు చెయ్యలేకపోయావు. దానికి మరీ ఇంతగా ఆలోచించి మనసుపాడు చేసుకోకు. నీ ఆరోగ్యం కూడా చెడగొట్టుకోకు." ధైర్యం చెప్పారు కృష్ణమూర్తి.

కళ్ళు తుడుచుకుని లేచింది భారతి.

***

"భారతీ!" అత్తగారు పిలుస్తోంది.

"అత్తయ్యా! మీరు. మీరేనా. ఇదంతా కలా! ఛ! ఇప్పుడు నాకు తృప్తిగా వుంది. వచ్చే పుట్టినరోజుకి ఎలాగైనా మీకు పట్టుచీర కొంటాను. పిచ్చి ఆలోచనలతో ఇన్నాళ్ళు తాత్సారం చేశాను.

"పిచ్చి భారతీ! ఇప్పుడు నాకు పట్టుచీర అంత ముఖ్యమా! అసలే ఖర్చులు ఎక్కువగా వున్నాయి. ముందు ముందు చాలా ఖర్చులుంటాయి. అసలయినా నా సంగతికేంగానీ, నీ కుందా చెప్పు మంచి పట్టుచీర. ఉన్నది ఒక్క సాదా పట్టుచీర. అది కూడా మీ తమ్ముడి పెళ్ళికి మీ వాళ్ళు పెట్టింది. బయటికి వెళ్ళి ఉద్యోగం చేస్తూ నలుగురిలో తిరిగే దానివి నీ కవసరం మంచి చీరలు. నా కెందుకు చెప్పు. మరీ నేత చీరలు జరీ ముడుచుకుపోయి, గంజి, ఇస్త్రీ లేకపోతే బాగుండటంలేదని అన్నానేకానీ అది ఇప్పుడంత అవసరమేమీ కాదు. నేనేదో మాటవరసకన్న మాట పట్టుకుని ఇంతలా బాధపడాలా పిచ్చి పిల్లా? నువ్విలా ఆలోచిస్తావని తెలిస్తే అసలు నీదగ్గర ఆ ప్రస్తావనే తెచ్చేదాన్ని కాదు. ఏదైనా అవకాశం వుంటే నువ్వే రెండు మంచి పట్టు చీరలు కొనుక్కో. ఎక్కడికైనా నలుగురిలోకి వెళ్ళినప్పుడు కట్టుకోటానికి వుంటాయి. నువ్వు కట్టుకుంటే నేను కట్టుకున్న తృప్తికాదా! ముందు నువ్వు కొనుక్కో ఈ వయసులో కాకపోతే ఇంకా ఎప్పుడు కొనుక్కుంటావు." 'సున్నితంగా మందలించిందావిడ.

"అత్తయ్యా! నా మీద కోపం లేదా మీకు. ఎంత బాగా అర్థం చేసుకున్నారు."

"సర్లే! పరిస్థితులు బాగా లేక నువ్వు కొనలేదని నాకు తెలియదా! దీని కోసం నువ్వు బెంగపెట్టుకోకు"

అంతలోనే ఆవిడ ఆకారం అదృశ్యం అయిపోయింది.

"భారతీ" తట్టిలేపుతున్నాడు భర్త. మెలుకువ వచ్చింది భారతికి. చనిపోయి కూడా ఆవిడ తనని సముదాయిస్తోంది. ఎంత మంచిదో! ఆమె మనసు అర్థమయింది. మంచివాళ్ళ మనసులంతేమరి!

